# 9 / 11 లవ్‌స్టోరీ

ముదిగంటి సుజాతారెడ్డి

కథ


**వెనుక దుమ్ము బూడిద ఆకాశం ఎత్తుకు ఉవ్వెత్తున లేస్తున్నాయి. అగ్నిజ్వాలలు! మంటలు ఆకాశాన్నంటుతున్నాయి. నల్లని మేఘాల్లాంటి పొగలు! భరించలేని వేడి! ఛట్‌ఛట్‌మని విరుగుతున్న పేలుతున్న అద్దాలు! నిప్పుల్లో పెట్టి వేడిచేసిన శలాకాల్లాగా ఎఱ్ఱగా కాలుతున్న ఇనుప దూలాలు!**

అబ్బ! వేడి! మంటలు! సేవ్! సేవ్!... అన్న ఆర్తనాదాలు. అంతటా దుమ్ము! బూడిద! నల్లని పొగలు! ఏం కన్పించటంలేదు. ఫట్‌ఫట్‌మని అద్దాలు చిట్లుతున్న చప్పుళ్ళు!... హా!... హా!... అన్న కేకలు! ఆర్తనాదాలు! రన్!... రన్!... అన్న అరుపులు. సేవ్!... సేవ్ మీ!.... అన్న పిలుపులు! ఏడ్పులు! అన్నీ వదిలేసి జనం ఉరుకులు! పరుగులు! ఎవరికి దొరికిన దిక్కు వాళ్ళు ఉరుకులు! ఎవరికి తోచిన దిక్కు వాళ్ళు పరుగులు! కాళ్ళకిందంతా వేడివేడిగా ధూళి! దుమ్ము! బూడిద! గాజు పెంకులు! గాయాలు! రక్తం! మానవ హాహాకారాలు! ఏడుపులు! కేకలు! ఏం కన్పించటంలేదు. కాళ్ళకింద లావా ప్రవహిస్తున్నట్లుగా భరించలేని వేడి! అగ్నిజ్వాలలు వెంటాడుతున్నట్లుగా వేడి! ఏం కన్పించటంలేదు. పరుగు! పరుగు! ఏం తోచటంలేదు.

ఏందిది? ఇదంతా ఏమిటి?

విమానాల దాడినా? యుద్ధమా? బాంబు వేసారా?... హిరోషిమా నాగసాకీలో లాగా!... బెర్లిన్ మీద దాడుల్లాంటివా? ఎవరు వస్తారు? ఎవరు వేస్తారు? రష్యా దాడి చేసిందా?... రష్యానా కాదు! కాదు!... మరి ఎవరీ కొత్త శత్రువు? అంతా నాశనం! సర్వనాశనం! వియత్నాంలో ఇట్లానే కురిసాయా బాంబులు? అదే బాంబుల వర్షమా? రాకెట్ల దాడులా? మారణ హోమమా? మొత్తం న్యూయార్క్ తగులబడిపోతున్నదా? ఆకాశ హర్మ్యాలన్నీ కూలిపోతున్నాయా? న్యూయార్కంతా కాలి బూడిదవుతున్నదా!... లిబర్టీ స్ట్యాచ్యూ!... అదికూడా కూలిందా?... పేలిపోయిందా?...

ఒకటే ఆందోళన! భయం! పరుగులు!... ఇంత గందరగోళం ఎన్నడూ చూడలేదు. అంత పెద్ద సముద్రం!.. ప్రశాంత మహాసాగరం దాటి దాడులు ఎట్లా సాధ్యం! ఎవరీ దాడి! ఎన్ని గుండెలు వాళ్ళకు! అయినా అంత ధైర్యం ఎట్లా వచ్చింది వాళ్ళకు! అంత నైపుణ్యమెక్కడిది వాళ్ళకు! ఎంత వ్యూహంకావాలి! దుర్భేధ్యంకదా!.. అబేధ్యాన్ని బేధ్యం.. అసాధ్యాన్ని సాధ్యంచేసిన బుర్ర ఎవరిది? అంత తెలివి తేటలు ఎక్కడ్నుంచి వచ్చాయి వాళ్ళకు? అదరగొట్టే దాడి! వ్యూహం!... ఎన్నాళ్ళ నుంచి జరుగుతున్నదీ వ్యూహం! కుట్ర! పన్నాగం!... ఎఫ్‌బీఐసీఐఏలుయేం చేస్తున్నాయి! వాళ్ళకు తెలియంది లేదని గద గర్వం! ఆ గర్వాన్ని ముక్కలు చెక్కలు చేస్తున్న ఈ దాడి ఎవరిది? ఈ వ్యూహం ఇంత పకడ్బందీగా ఎవరు తయారు చేసారు? ఇదంతా ఒక్క నాటిది కాదు! ఎన్నాళ్ళ నుంచి జరుగుతుందో ఈ ప్లాను! ఎఫ్‌బీఐ సీఐఏల ఘోర వైఫల్యం! ఎవరు చేసారీ మోసం! దగా! కుట్ర! దగానా? దగా ఎట్ల? తెలివితో తెగింపుతోచేసిన ప్లాన్! వ్యూహం! ఈ ఊహ ఎవరికి వచ్చిందో? మెచ్చుకోవాలి! ఛీ! మెచ్చుకోవటమా? ఎందుకు? ఎందుకేంది! ఇంత వరకు మమ్మల్ని ఎవరూ ఛేదించలేరని నిద్రపోతున్నందుకు! మమ్మల్ని మించిన సాంకేతిక జ్ఞానం, బలం లేవన్న అహంకారం... అదిగో ఆ అద్దాల్లాగా ఫట్‌ఫట్‌మని ముక్కలైనందుకు! ఛట్ ఛట్‌మని ఛేదించుకు పోయినందుకు! ఈ వ్యూహం రచించిన వాళ్ళ మెదడు సామాన్యమైంది కాదు! మెచ్చుకోవాల్సిందే! ఇది ఓరియంటల్ మైండు! ఎప్పుడో స్పార్టకస్ వీరులను గేట్‌వే ఆఫ్ ఫైర్ దగ్గర ఎదిరించి ఓడిపోయిన ఓరియంటల్ దాడి! ఇప్పుడు విజయం సాధించిందా? ఓరియంటల్! ఓరియంటల్! అంటే చిన్నచూపు! ఏదో భయం! ఏదో ఆకర్షణ! ఆకర్షణలో ఏదో భయం! ఆర్ట్- బాస్ మాటల్లో తను ఎన్నోసార్లు కనిపెట్టింది.



సుష్మ ఆలోచనలు పరిగెత్తుతున్నాయి. ఆమె పరిగెత్తుతున్నది. ఆర్ట్ పరిగెత్తుతున్నాడు. ఆర్ట్ చేయి సుష్మ చేతిలో వుంది. సుష్మ ముందు- ఆర్ట్ వెనుక పరిగెత్తుతున్నారు. సుష్మ ఎటు పరిగెత్తితే ఆర్ట్ అటే పరిగెత్తుతున్నాడు. కొన్ని సెకన్లు... కొన్ని నిమిషాల క్రితం ఈ విషయం ఊహించ రానిది! ఆఫీసులో ఆర్ట్ అంటే అందరికీ హడలు! ఆఫీసులో అందరికీ అతడు బానిసల యజమాని. డిక్టేటర్! భయం! టెర్రర్! వర్క్! వర్క్! అతడు వేసే కొరడా దెబ్బలు! ఎవరు ఊపిరి పీల్చినా సహించడు.

"డోంట్ వేస్ట్ టైమ్!" అని కొరడా ఝుళిపిస్తుంటాడు.

అట్లా అని ఆర్ట్ రాక్షసుడేం కాదు. భూతంలా ఏం ఉండడు. అందరు కన్నెపిల్లలు కలలు కనే రాజకుమారుడిలాగానే వుంటాడు. నలగని సూట్! చెరగని వెంట్రుకలు! అలసట లేని ముఖం! మాయని బూట్లు! ఎప్పుడూ ఎక్కడా దుమ్ము ధూళి అంటని వేషం! రూపం! భాష!

సుష్మ చేతిలో ఎమ్‌సీఏ డిగ్రీతో ఇండియా నుంచి న్యూయార్క్‌లో అడుగుపెట్టింది. వీసా వంటి పెను భూతాల వంటి

అడ్డంకులు దాటింది. యూ ఎస్స్ ఆఫ్ ఏలో ఆర్నెల్లు అక్కడా ఇక్కడా పనిచేసింది. అనుభవం గడించింది. భాషలోని యాసలు నొక్కులు పట్టుబడ్డాయి. డబ్ల్యుటీసి ఆమె లక్ష్యం. ప్రపంచానికి కేంద్రమైన ఆచోట పనిచేయాలని ఆమె కల! డబ్ల్యుటీసిలోని ఆఫీసులో అడుగు పెట్టగానే ఆర్ట్ అనే ఆఫీసరు రాక్షసున్ని చూడగానే ఆమె మొదట రియాక్షన్ "హౌ హ్యాండ్ సమ్ హీ ఈజ్!"అని! కాని ఏకే ఫార్టీ సెవెన్ రివాల్వర్ నుంచి దూకే తూటాల్లాంటి అతని ప్రశ్నలకు తట్టుకొని నిలబడింది సుష్మ. ఉద్యోగం ఆమె ఒడిలో పడింది. తన లక్ష్యం నెరవేరినందుకు ఎగిరి గంతేసింది. సుష్మ పనిమంతురాలు. తన పని తాను చేసుకుపోయే బుద్ధిమంతురాలు. అయినా తప్పులు అప్పుడు అప్పుడు చేయటం మానవ లక్షణం. అందులో కామాలు సెమీకోలన్లను తప్పు పట్టే బాస్ వున్నప్పుడు తప్పుల తిప్పలు తప్పవు. మొదటి సారి కామా మిస్సింగ్ అని ఆర్ట్ సుష్మను దొరికించుకున్నాడు!

"ఐయామ్ సారీ ఫర్ మిస్టేక్ మిస్టర్ కార్నివాలిస్!" అంది సుష్మ పైకి చిరునవ్వు తెచ్చిపెట్టుకొని. లోపల అతని దుర్మార్గపు డిక్టేటర్ షిప్‌కు మండిపడుతూనే వుంది.

"కార్నివాలిస్!...." కనుబొమ్మలు పైకెత్తాడు ఆర్ట్. ఆశ్చర్యం కోపం కలిగినప్పుడు అట్లానే ఎత్తుతాడు ఆర్ట్.

"యా! హీ వాజ్ అవర్ వైస్రాయి... వన్స్ అపాన్ ఏ టైమ్!" నవ్వుగాని నవ్వు నవ్వింది సుష్మ.

కార్నివాలిస్ అన్నది ఆర్ట్ ఫామిలీ నేమ్. ఆ పేరు వినగానే భారతదేశాన్ని బ్రిటిషురాణి ప్రతినిధిగా పాలించిన వైస్రాయిల్లో ఒకరి పేరు ఇదే అని జ్ఞాపకం వచ్చింది సుష్మకు. ఆ వంశం వాడే అయివుంటాడు

"కలోనియల్ రూలర్! స్లేవ్ డ్రైవర్!" లోలోపల పళ్ళు నూరింది సుష్మ.


కాని విచిత్రంగా ఆర్ట్ చిరునవ్వు నవ్వాడు.

"ఐనో! ఐనో!... హిస్టరీ. హీ వాజ్ మై గ్రేట్ గ్రేట్ గ్రేట్ గ్రాండ్ ఫాదర్" ఆర్ట్ ముఖం మళ్ళీ గంభీరమైంది.

"హో! కలోనియల్ రూలర్‌కు వారసుడు. న్యూస్లేవ్ డ్రైవర్!" పళ్ళు బిగబట్టి గులిగింది సుష్మ.

"వాట్ డు యూ సే!" కనుబొమ్మలు పైకెత్తాడు ఆర్ట్. అతనికి సుష్మ అన్న మాటలు వినపడలేదు.

"మిస్టర్ కార్నివాలిస్!" చెప్పబోయింది సుష్మ.





"నో! నో! జస్ట్ ఆర్ట్. నోఫార్మాలిటీస్ ప్లీజ్!" ఆర్ట్ సుష్మను నివారించాడు.

"కలోనియల్ రూరల్ కొత్తరూపం!" మళ్ళా లోలోపల కసిగా పళ్ళునూరింది సుష్మ.

"ఒకే! ఆర్ట్! ఐయామ్ సారీ ఫర్ కామా" సుష్మ తెచ్చుకున్న నవ్వుతో అంది.

"ఒకే! నెక్స్ట్ టైమ్ నో మిస్టేక్" ఆర్ట్ ఆగకుండా అక్కడ్నుంచి ముందుకువెళ్ళిపోయాడు.

**అందరికీ అమెరికా రావాలనే కోరిక. ఫ్రీ లాండ్! కంట్రీ ఆఫ్ ఫ్రీడమ్! అందరికీ ఈ అవకాశాల దేశంలో తమ అదృష్టాన్ని పరీక్షించు కోవాలనీ రిచ్‌రిచ్ అయిపోవాలని కోరిక! ఏదో ఆకర్షణ ఆమె ఫ్లవర్‌షిప్ బయల్దేరిందగ్గర్నుంచి.**

"కలోనియల్ బ్రూట్! వైట్ సూపర్ రేస్ కాంప్లెక్స్! జస్ట్ సుపీరియారిటీ కాంప్లెక్స్! ఐ నో!" మనసులో కసిగా అనుకుంది సుష్మ.

అటువంటి ఆర్ట్ చేయి ఈరోజు తన చేతిలో. రక్తం కారుతూ... బలహీనంగా తను ఎటు లాక్కొనిపోతే అటు పరిగెత్తుతున్నాడు. తను ఎన్నడైనా అనుకుందా...ఆర్ట్ ఈవిధంగా తన చేతిలో వుంటాడని! సుష్మ అపార్ట్ మెంటు డబ్ల్యుటీసీకి దగ్గరే. నాలుగు వీధుల అవతల కుడిచేతివేపు తిరిగితే గల్లీలాంటి లేన్‌లో వున్న ఒక అపార్టుమెంటు ఆమెది. చాలా లక్కీగా ఆ అపార్టుమెంటు దొరికింది సుష్మకు. డబ్ల్యుటీసీకి నడచిపోవచ్చు! తోవలోనే అల్లే దాటి అడ్డంగా పోతే పక్క లేన్‌లోనే అజ్జూ దాదా కాఫీ షాప్. ఘీతో చేసిన పరాఠాలు. ఆలుగోబీ... పనీర్ మసాలా కర్రీలు. ఒక్క పరాఠా తిని ఒక మగ్గు కాఫీ తాగితే చాలు మళ్ళీ మధ్యాహ్నం వరకు తిండి అక్కర్లేదు. అజ్జూ అసలు పేరు అజయ్‌మిశ్రా. బిహార్ నుంచి కొన్నాళ్ళు నడిపాడట. తర్వాత ఈ చిన్నహోటు డబ్ల్యుటీసీకి దగ్గరగా సంపాదించి కాఫీ కార్నర్ నడుపుతున్నాడు.

"అజ్జూదాదా అమెరికా ఎట్లా వచ్చావ్?" ఒకరోజు అడిగింది సుష్మ. ముడతలు పడిన అతని ముఖంలో నవ్వుల ముడతలు కలిసిపోయాయి.

"సబ్‌తక్దీర్! అమ్రేక ముఝే
ఖీంచ్‌కే లాయా!
బస్ యాహా పహుంచ్ గయా!"

అన్నాడు.

అందరికీ అమెరికా రావాలనే కోరిక. ఫ్రీ లాండ్! కంట్రీ ఆఫ్ ఫ్రీడమ్! అందరికీ ఈ అవకాశాల దేశంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలనీ రిచ్‌రిచ్ అయిపోవాలని కోరిక! ఏదో ఆకర్షణ ఆమె ఫ్లవర్‌షిప్ బయల్దేరిందగ్గర్నుంచి. లేకపోతె ఆర్ట్ కార్నివాలిస్... ఒకప్పుడు భారతదేశానికి వైస్రాయి కుటుంబం! ఇక్కడికి రావటమేమిటి?

సుష్మ ఆర్ట్‌ను లాక్కొని తన అపార్టుమెంటు చేరుకుంది. అది ఒకటే రూమ్! అందులోనే వంటగది! బెడ్రూమ్! డ్రాయింగ్ రూమ్-అన్నీ! ఒ పక్కన విశాలమైన వాష్‌రూమ్. అందులోనే బాత్ టబ్! వాషింగ్ మెషీన్ వగైరా. తాళంతీసి అర్రలోకి పోంగనే సుష్మ ఆర్ట్‌ను బెడ్‌మీద పడుకోబెట్టింది. నొసటి మీద భుజం మీద గాజు పెంకులు గుచ్చుకున్నాయేమో! చేతికి కోటును అంగీని చీల్చుకొని గాయం. రక్తం కారిపోతున్నది.

ఆర్ట్ సూటంతా రక్తంతో తడిసిపోయింది. ముందుగా రక్తం కారటం ఆపాలి! సుష్మ వాష్‌రూమ్‌లోకి పరిగెత్తింది. కాటన్ డెట్టాల్ సీసాతో యాంటీసెప్టిక్ క్రీమ్ ట్యూబ్‌తో ఉరుక్కుంటూ వచ్చింది. ఆర్ట్ కోటు షర్ట్ విప్పింది కష్టంగా. కాస్త స్పృహలో వున్న ఆర్ట్ సహకరించాడు.

సింహంలా వుండే ఆర్ట్ ఎంత బలహీనంగా తను ఏది చెప్తే అది చేస్తున్నాడు. అది చూసి సుష్మకు జాలి కలిగింది.

పాపం ఆర్ట్! అనుకుంది.

ఈరోజు అమ్మ ఇండియా నుంచి ఫోనుచేసే రోజు. అమ్మ ఫోను పొద్దున్నే ఎనిమిది గంటల లోపే వస్తుంది. కాని తొమ్మిది...పదయినా అమ్మ ఫోను రాలేదు.

సుష్మ పరేషానయింది.

సుష్మ ఫోను చేస్తే కలువలేదు.

అయితే అమ్మకూ తన ఫోను కనెక్ట్ కావటం లేదేమో! లైన్లు క్లియర్‌గా లేవేమో! అయినా ఇంకో పావుగంట, అర్థగంట చూస్తాను! అనుకుంది సుష్మ. ఆఖరికి పదింబావుకు ఫోను ట్రిన్...ట్రిన్ అని మోగింది. ఎత్తితే అమ్మనే. అమ్మతో పది నిమిషాలే మాట్లాడింది.

"అమ్మా! నాకాఫీసుకు లేటవుతున్నది"అంది సుష్మ. సరే! మళ్ళీ రేపు చేస్తానులే సుషీ!"

అంది అమ్మ.

సుష్మ ఫోన్ పెట్టేసి దబదబ అపార్ట్‌మెంటు తలుపు లాక్ చేసింది. లిఫ్టులో పదో అంతస్తు నుంచి కిందికి వచ్చి గబగబ వీధిలోకి నడిచింది. ఎప్పటిలాగానే జనం! వేగంగా అడుగులు వేస్తూ లేన్ దాటింది. అలేలోకి ప్రవేశించింది. అలే దాటి మళ్ళీ మరో లేన్‌లోకి వచ్చింది.

"ఈరోజు లేటయింది! ఆర్ట్ మింగేసేటట్లు చూస్తాడు నాకు తెలుసు!" అనుకుంటూ సుష్మ పరుగులాంటి నడక సాగించింది. అజ్జు దాదా దగ్గర పరాఠా తిని కాఫీ తాగే టైమ్ లేదు. కాఫీ కార్నర్‌లో ఆగకుండా ముందుకు పోయింది.


"సుష్మాజీ! కాఫీ" అరిచాడు అజ్జూ వెనుక నుంచి.

"ఇప్పుడు కాదు భయ్యా! మా సింహానికి కోపం వస్తుంది. లేటయింది. దో పహర్‌కో ఆ వుంగీ (మధ్యాహ్నం వస్తాను)" అంటూ పరుగు లాంటి నడకతో ముందుకెళ్ళిపోయింది సుష్మ.

"ఈరోజు ఉపవాసం!... నో నాస్తా... బ్రేక్ ఫాస్టుకు నోచుకోలేదీ రోజు... ఇంకా ఆలస్యమైతే ఆర్ట్ మింగేస్తాడు" పరిగెత్తింది సుష్మ.

అదిగో డబ్ల్యుటీసీ... నాలుగడుగులు... ముందున్న మెట్లెక్కి లోపలికి పోతె లిఫ్టు లు!.... రెండు నిమిషాల్లో నూటారెండో అంతస్తు! ఆఫీసులో వుంటుంది. ఆర్ట్ కోపంగా గుడ్లురుముతాడు! తప్పదు! మెట్లెక్కింది సుష్మ. పైన విమానాల రొద! ఆ లొల్లి ఎప్పుడూ వున్నదే. న్యూయార్క్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నుంచి ప్రతి ఐదు సెకండ్లకు ఓ జెట్ విమానం ఆకాశంలోకి దూసుకుపోతూనే వుంటుంది. సుష్మ లిఫ్టు వైపు నడిచింది. లిఫ్టు వచ్చి ఆగింది. తలుపులు తెరుచుకున్నాయి. సుష్మ చేతి గడియారం వైపు ఆత్రంగా చూసింది. పదిగంటల నలభై నిమిషాలు! నిజంగా చాలా ఆలస్యమైంది. ఆర్ట్ ఎర్రగా కొరకొరమని చూస్తాడు నావైపు. నాకు తెలుసు!... అనుకొని లిఫ్ట్‌వైపు కదిలింది. కాని అద్భుతం! ఆశ్చర్యం! లిఫ్టులో నుంచి బయటికి నడిచి వచ్చి ఎదురుగా ఆర్ట్! అతని కండ్లల్లోకి చూసింది నీలికళ్ళల్లోంచి నిప్పుకణాలు కురిసినట్లనిపించింది సుష్మకు. వణికిపోయింది! ఆమె మెదడు మొద్దుబారినట్లయింది! భయంతో కొద్దిగా నోరు తెరిచింది!... అంతే ఏమైందోతెలియదు! డబ్ల్యుటీసి బిల్డింగంతా ఊగినట్లయింది. ఆర్ట్ కోపమే ఆవిధంగా తనకు అనిపిస్తుందేమో అనుకుంది సుష్మ!

భూకంపం వచ్చినంతగా కాళ్ళకింద నేల కదిలింది. ఏదో పెద్ద భయంకరమైన శబ్దం! ధ్వనులు ప్రతిధ్వనులు! డబ్ల్యుటీసీ మొత్తం ఊగిపోయింది! ఎంత కోపం ఆర్ట్‌కు! వణికిపోయింది సుష్మ! మళ్ళా ఏదో రాతిబండ... కాదు కాదు...పెద్ద పర్వతం డబ్ల్యుటీసీ మీద పడ్డంత శబ్దం! డబ్ల్యుటీసీ ఊగిపోతున్నది! కూలిపోతున్నది!... డబ్ల్యుటీసీ మీద దూసుకు



పోయే విమానాల నుంచి బాంబులు కురిపించారా? భరించరాని శబ్దం! పునాదుల నుంచి డబ్ల్యుటీసీ కదిలింది. భూకంపమా?... ఆర్ట్ కోపం కాదిది! డబ్ల్యుటీసీ టవర్లు కూలిపోతున్నాయి. గాజులు చిట్లిపోతున్నాయి. గలగలమని గాజు పెంకుల భయంకర ధ్వనులు! అంతటా చీకట్లు! మంటలు! పొగలు! హాహాకారాలు! ఎవరికి దొరికిన దిక్కు వాళ్ళు పరిగెత్తుతున్నారు. సుష్మకు తన ఎదురుగా దగ్గరగా నిలబడి తన కళ్ళల్లోకి ఉరుములు మెరుపులు కురిపిస్తున్న ఆర్ట్ కన్పించాడు. సుష్మకు ఏం తోచలేదు. వెంటనే ఆర్ట్ చేతిని తన చేతిలోకి తీసుకుంది. బయటకి రోడ్డుమీదికి పరిగెత్తింది. వెంట తగిలి వేడి దుమ్ముధూళి! పొగ! వాటికన్నా వేగంగా సుష్మ ఆర్ట్ చేతిని లాక్కుంటూ పరుగు! అటు పక్క ఇటుపక్క వెనుక ముందూ అందరూ అదేవిధంగా పరిగెత్తుతున్నారని సుష్మ గమనించే స్థితిలో లేదు. వేగంగా అతివేగంగా ఆర్ట్‌ను తనతో లాక్కుంటూ పరిగెత్తింది సుష్మ.

> **సుష్మ తన అపార్టుమెంటు కిటికీలోంచి బయటికి చూసింది. షాకయింది! తనకు రోజూ ఆకాశంలోకి దూసుకుపోయి కన్పించే డబ్ల్యుటీసీ రెండు టవర్లు లేవు! వాటి స్థానంలో దట్టంగా పొగ పైకి లేస్తూ కన్పించింది!**

పక్కమీద రక్తంతో తడిసిన ఆర్ట్. సగం స్పృహతో వున్న ఆర్ట్ ఒంటి మీదున్న రక్తాన్నంతా డెట్టాల్‌లో తడిపిన దూదితో తుడిచింది సుష్మ. యాంటీసెప్టిక్ క్రీమ్‌ను దూది కద్ది గాయాలను అద్దింది. నొప్పిగా వుందేమో, ఆర్ట్ మూలిగాడు. రక్తం కారటం ఆగింది.

"పెయిన్!.... పెయిన్!..." ఆర్ట్ పళ్ళు బిగబట్టి మెల్లగా అరిచాడు. బాగా పరిశీలించి చూస్తే చర్మం మీద ఎక్కడా గాజుపెంకులు లేవు. కాని అవి చేసిన చిన్నవి పెద్దవి గాయాలున్నాయి. పుండ్లలాగా చర్మం మీద రక్తాన్ని చిమ్ముతున్నాయి. యాంటీసెప్టిక్ క్రీమ్‌తో తుడిచిన తర్వాత రక్తం చిమ్మటం ఆగిపోయింది. కాని ఆర్ట్‌కు నొప్పిగా వుందేమో నిరంతరంగా మూలుగుతున్నాడు. చుట్టూ ఏం జరిగిందో తెలియక చలించిపోయినట్లుగా వుంది. మినరల్ వాటర్‌తో రెండు పెయిన్ కిల్లర్ గోలీలను ఆర్ట్ చేత మింగించింది.

"ఎవరినైనా డాక్టర్ని చూడాలి!... తన కజిన్ మురళి న్యూయార్క్‌లోనే వున్నాడు. అతన్ని పిలవాలి. ఇప్పుడు దొరుకుతాడా?..." అనుకుంటూ సుష్మ ఫోను ఎత్తింది. ఫోను ఎంత తిప్పినా మురళి నెంబరు కలువలేదు. ఫోను లైన్లు సరిగ్గా లేవు. సుష్మ తన అపార్టుమెంటు కిటికీలోంచి బయటికి చూసింది. షాకయింది! తనకు రోజూ ఆకాశంలోకి దూసుకుపోయి కన్పించే డబ్ల్యుటీసీ రెండు టవర్లు లేవు! వాటి స్థానంలో దట్టంగా పొగ పైకి లేస్తూ కన్పించింది!

"మియో దియో! (మైగాడ్!)" సుష్మ పెద్దగా అరిచింది. ఈమధ్య నేర్చుకున్న ఇటాలియన్ భాష ప్రభావంతో.

"వాట్ హ్యాపెన్డ్!" మూలిగినట్లుగా అడిగాడు ఆర్ట్.

సుష్మ ఆర్ట్ వైపు చూసింది. ఆర్ట్ కళ్ళు తెరిచి వున్నాయి. పూర్తి స్పృహలో వున్నాడు. షాక్ నుంచి కొంచెం బయటపడ్డట్లున్నాడు.

"రెండు టవర్స్ లేవు!" అంది సుష్మ చేతిని చాపి వేలితో బయటికి చూపిస్తూ. ఆర్ట్ బెడ్ మీంచి కొద్దిగా పైకి లేచాడు. కిటికీలో నుంచి బయటికి చూసాడు.

"మైగాడ్! ఏదో ప్రళయం! ఐనో! ఐనో!" ఆర్ట్ కలవరపడిపోయాడు. ఆర్ట్ ఆత్మవిశ్వాసం కోల్పోవటం ఎప్పుడూ చూడలేదు సుష్మ. ఎప్పుడూ లోకాలను జయించే ధీమాతో వుండే ఆర్ట్‌నే చూసింది. కాని ఇప్పుడు ఆర్ట్ కలవరపాటును చూసి ఆమెకు జాలేసింది.


"ఆర్ట్! యూ మస్ట్ రెస్ట్." అంది సుష్మ ఆర్ట్‌ను కోమలంగా తాకి పడుకోబెట్టింది. వాష్ రూమ్‌లోకి పరిగెత్తి నిద్ర గోలీ తెచ్చింది. అతని చేత మింగించింది. కొన్ని నిమిషాల్లోనే ఆర్ట్ నిద్రలోకి జారుకున్నాడు. సుష్మ మళ్ళా ఫోను డయల్ చేసింది. డయల్ చేయగా చేయగా ఆఖరికి మురళి నెంబరు తగిలింది.

"మురళీ!" అరిచింది.

"ఆర్‌యూ ఓకే సుష్మా!" అడిగాడు మురళి.

"అయామ్ ఓకే మురళీ! ఒకసారి నువ్వు నా అపార్టుమెంటుకురా! ఇట్ ఈజ్ అర్జెంట్!" అంది సుష్మ ఆత్రంగా కంగారుగా.

ట్రాఫిక్ రద్దీలో మురళి సుష్మను చేరుకోవటానికి చాలా టైమే పట్టింది. మురళి ఆర్ట్‌ను పరీక్షించాడు. పెద్ద దెబ్బలేంలేవు! నో ఫ్రాక్చర్స్ ఆల్సో! కొన్ని మందులు రాసిచ్చాడు. మెలకువ వచ్చింతర్వాత ఇయ్యమన్నాడు.



"కాని అతని బంధువులు భార్యాపిల్లలెవరైనా వున్నారేమో కాంటాక్ట్ చేయి. ఈ హీజ్ సేఫ్ అని వాళ్ళకు చెప్పు. వాళ్ళు పరేషానవుతున్నారేమో! బయట పరిస్థితి చాలా భయానకంగా వుంది. ప్రతి ఒక్కర్ని మృత్యుభయం వెంటాడుతున్నది. జాగ్రత్త సుష్మ! టేక్ కేర్!" చెప్పి మురళి వెళ్ళిపోయాడు. సుష్మ కొంతసేపు మౌనంగా వుండిపోయింది.

"ఆర్ట్‌కు కావల్సిన వాళ్ళను కాంటాక్ట్ చేయాలని తోచనే లేదు తనకు!" ఆర్ట్ వైపు చూసింది సుష్మ.

ఆర్ట్ కళ్ళుతెరచి తనవైపే తదేకంగా చూస్తున్నాడు. ఎంతసేపట్నుంచి చూస్తున్నాడో! అని కళ్ళు ఎప్పటిలాగా నీలి సముద్రాల్లా వున్నాయి గంభీరంగా.

"ఆర్ట్! మీ వాళ్ళు ఎవరైనా వుంటే చెప్పు. పేరెంట్స్... వైఫ్... చిల్డ్రన్... ఐవిల్ కాల్ ఎండ్ టెల్ దెమ్... యూ ఆర్ సేఫ్!" సుష్మ మాటలు విని ఆర్ట్ బాధగా మూలిగాడు.

"సుష్!...నాకెవరూలేరు. నిన్ను నేను సుష్ అని పిలవవచ్చునా?" అడిగాడు. "ఎప్పుడూ సుష్మ అని పూర్తిపేరుతో పిలిచే ఆర్ట్‌కీరోజు ఏమైంది. అంత బలహీనంగా కన్పిస్తున్నాడేమిటి?" మనసులో అనుకుంది సుష్మ.


"యూ క్యాన్ కాల్ మీ సుష్. నేను నీ ఫ్రెండ్‌ని" చిరునవ్వు నవ్వింది సుష్మ ఆర్ట్ చేతిని చేతిలోకి తీసుకొని.

"దటీజ్ గుడ్!" ఆర్ట్ నీలి కళ్ళు గంభీరంగా కన్పించాయి. ఆ నీలికళ్ళు క్షణంలో నీరసంగా మూతపడ్డాయి. ఆర్ట్ నిద్రలోకి జారుకున్నాడు మళ్ళీ.

సుష్మకు డబ్ల్యుటీసీలో జరిగినదంతా సినిమా దృశ్యంలాగా కళ్ళ ముందు కన్పించింది. వణికిపోయింది. అమ్మ ఫోను కోసం ఎదురు చూస్తుంటే ఆలస్యమైంది. రోజులాగా తొందరగా పోతే తను ఆఫీసులో నూట రెండో అంతస్తులో వుండేది. కాలి బూడిదైపోయేది. మరణించిన వందలాది వేలాది జనంలో! తన బాస్! అతనూ మరణించి వుండేవాడు! ఆర్ట్ కిందికి ఎందుకువచ్చాడు? తెలియదు! ఎందుకోగాని అది అతన్ని రక్షించింది. అతను లిఫ్టులో కిందికి రావటం తను ఆ క్షణంలో అక్కడ వుండటం, అతన్ని లాక్కుని అలేలోకి పరిగెత్తటం... అదంతా ఇప్పుడు తలచుకుంటే ఏదో మిరకల్ జరిగినట్లుగా వుంది!

సుష్మ మెల్లగా లేచి టీవీ ఆన్ చేసింది. అదే వార్త... డబ్ల్యుటీసీ మీద దాడి! రెండు విమానాలు... హైజాక్ చేయబడిన విమానాలు డబ్ల్యుటీసీని గుద్దేసాయి. రెండు టవర్లు సెకన్ల తేడాతో కూలిపోయాయి!... అంతా విధ్వంసం!.... అదంతా టెర్రరిస్టుల పని!.... ఎన్నో నెలలుగా సాగిన వ్యూహం!... చేసిన కుట్ర... వేసిన పన్నాగం!... అట్లా వార్తలు ఎడతెగకుండా ప్రసారమౌతున్నాయి. ఎవరో ఫోటోగ్రాఫర్ కెమెరాలో అనుకోకుండా బంధింపబడిన దృశ్యాలు టీవీలో మాటిమాటికీ చూపిస్తున్నారు.డబ్ల్యుటీసీ ఉద్యోగులు మంటల్లో ఎర్రటి మంటల్లో ఫర్నేస్‌లోలాగా చిక్కుకుపోయి... కిటికీల వైపు పరిగెత్తి దూకపోతున్నారు! వీధుల్లో జనం ఏం జరిగిందో ఎరుక లేక పరిగెత్తుతున్నారు! పక్కనున్న ఆకాశ హర్మ్యాలు కొన్ని తగలబడిపోతున్నాయి! పరిగెత్తేవాళ్ళను ఇంటర్వ్యూలు!... అంతా మారణహోమంలా వుంది. జనం భయభ్రాంతులైపోయారు. టీవీ ప్రసారాలను ఏకకాలంలో ప్రపంచ దేశాలన్నీ చూస్తున్నాయి. అమ్మానాన్న తమ్ముడు కూడా ఈ దృశ్యాలు చూస్తున్నారా? తను క్షేమంగా వున్నట్లు వాళ్ళకు ఫోను చేయాలి. లేకపోతే పరేషాన్ అవుతారు. సుష్మ ఆలోచనలు ఎడతెగటంలేదు.

అయినా కట్టుదిట్టమైన సోదాలను తప్పించుకొని హైజాకర్లు మారణాయుధాలతో విమానాల్లోకి ఎట్లా ప్రవేశించగలిగారు? ప్రాణాలకు తెగించి వాళ్ళు విమానాలను టవర్లకు గుద్దేశారు. పాపం! ప్రయాణీకులూ బలయ్యారు. అంతా ఆశ్చర్యం! అద్భుతం!



అసలు విమానాలను టవర్లకు గుద్దేసే ఆలోచన ఎట్లా కలిగింది వాళ్ళకు? ఛీ! తనేమిటి ఆ గుద్దేసిన వాళ్ళ ప్లాన్‌ను అద్భుతం ఆశ్చర్యం అని మెచ్చుకోవటం! అసలది అమానుషం! రాక్షసత్వం! కాని అంత పకడ్బందీగా ఎట్లా చేయగలిగారు వాళ్ళు? సుష్మలో మళ్ళీ ఆశ్చర్యం!... గూఢచారులేం చేస్తున్నారు... గూఢచారుల కళ్ళుగప్పి వాళ్ళు ఎట్లా ఈ వ్యూహం రచించగలిగారు.ఈ వ్యూహం ఎన్నో రోజులుగా నెలలుగా తయారుచేసి వుంటారు! గూఢచారులనెట్లా తప్పించుకోగలిగారు. సుష్మ ఆలోచనల్లో సమయం తెలియలేదు.

"సుష్!... సుష్!...." నీరసంగా వున్న ఆర్ట్ గొంతు సుష్మ చెవుల్లోకి దూరింది. వెంటనే టీవీ ముందు నుంచి ఆర్ట్ దగ్గరికి ఉరికింది.

"యా!... ఆర్ట్!... అయామ్ హియర్" అంది మార్దవంగా.

"వ్వాట్ హ్యాపెన్డు?" అడిగాడు ఆర్ట్. అతని ముఖం తేటగా వుంది. నొప్పి కొద్దిగా తగ్గినట్లుంది.

సుష్మ టీవీలో చూసిన సమాచారమంతా ఆర్ట్‌కు చెప్పింది.

"మైగాడ్!... ఎంత దారుణం! ఎంత తెలివిగా చేసారు! ఓరియంటల్ మైండ్!" ఆర్ట్ గొంతులో ఆశ్చర్యం.

"ఓరియంటలా?" సుష్మ మనసులో అనుకుంది.

ఒకసారి ఆర్ట్ తను చేసిన పనిలో ఏదో తప్పు పట్టుకున్నాడు.

"నో ఆర్ట్! దటీజ్ నాట్ మిస్టేక్" అంది తను దృఢంగా. అది తప్పు ఎట్లా కాదో వివరించి అతనికి చెప్పింది. అప్పుడు ఆర్ట్ తన కళ్ళల్లో కళ్ళు పెట్టి చూసాడు.

"ఒకే! ఐ అగ్రీ విత్ యూ!" కనుబొమలు పైకెత్తి "ఓరియంటల్ మైండ్ ఆఫ్టరాల్!"... అన్నాడు. తిరిగిపోతూ వెటకారంగా నవ్వుతూ ఆర్ట్. తను విజయగర్వంతో నవ్వుకుంది.

"ఓరియంటల్! ఓరియంటల్! అని ఆర్ట్‌కు ఎందుకు కాంప్లెక్స్!... అది కాంప్లెక్సేనా?... ఏమో!..."

"ఆర్ట్‌లో ఓరియంటల్ మైండ్... గురించి ఒక అడ్మిరేషన్? మెప్పుతో కూడిన ఆకర్షణ! మళ్ళా వెటకారం! ఆ ఆకర్షణకు తనలో తనే భయపడటం!..."

"ఎందుకు?..." అనుకుంది సుష్మ.

ఇప్పుడూ అదే ఆశ్చర్యం! వెటకారం! ఓరియంటల్ మైండ్! అని.

"సుష్! ఏమాలోచిస్తున్నావు?" ఆర్ట్ ప్రశ్నతో ఈ లోకంలోకి వచ్చింది సుష్మ.

"నో నథింగ్!" ఉలిక్కిపడింది.

"ఆర్ట్! అటు చూడు బయటికి. రెండు టవర్స్ ఇక లేవు!" కిటికీ వైపు చూపించింది సుష్మ.

ఆర్ట్ పక్కలోంచి లేచి సుష్మ భుజం మీద చేయి వేసి మెల్లగా కిటికీ వైపు నడిచాడు. కిటికీలోనుంచి బయటికి చూసాడు.

ఆకాశంలో అంతా ఖాళీ! డబ్ల్యుటీసీ వున్న చోట నల్లగా దట్టమైన పొగ! ఎర్రటి మంటలు! మానవ శరీరాలు కాలిన కమురు వాసనలు మూసిన కిటికీలోంచి లోపలి వరకూ వ్యాపించి ఆర్ట్ నాసికారంధ్రాల్లో దూరాయి.

"ఎవ్రీ థింగ్ ఈజ్ డిస్ట్రాయిడ్! (అంతా నాశనమైపోయింది)" మెల్లగా ఆర్ట్ గులిగాడు.

"సుష్! సీ... ఇఫ్ యూవర్ నాట్ దేర్... నేనూ మరణించి వుండేవాడిని!" ఆర్ట్ వణికిపోయాడు.

"ఆర్ట్!..."ఆర్ద్రమైన గొంతుతో అంది సుష్మ. ఆర్ట్ చేతిని పట్టుకుంది.

"యూసేవ్డ్ మీ..."ఆర్ట్ సుష్మ చేతిని పైకెత్తి తన పెదాలతో చుంబించాడు.

ఇటువంటి చుంబనం అంటే పాశ్చాత్యులకు ఏం అర్థంలేదు. కాని తనో ఇండియన్! ఓరియంటల్! అయినా ఈ ముద్దులో ఏ అర్థాన్ని వెతకకూడదు" అనుకుంది సుష్మ.

(మిగతా 27వ పేజీలో)

# 9/11 లవ్‌స్టోరీ

(22వ పేజీ తరువాయి)

కాని హఠాత్తుగా "సుష్!..." ఆర్తితో అంటూ ఆర్ట్ బలంగా సుష్మను దగ్గరికి లాక్కున్నాడు.

"యూ సేవ్‌డు మై లైఫ్! ఐ లైక్... యూ... నో! నో! ఐ ఆల్ వేస్ లవ్ డు యూ!" గాఢంగా సుష్మను ఆర్ట్ గుండెలకు హత్తుకున్నాడు. ఆర్ట్ బిగి కౌగిలిలో సుష్మకు ఊపిరాడలేదు. "ఆర్ట్ బల హీనంగా వున్నాడు. అందుకే ఇది!" అనుకుంది సుష్మ.

"నో! నో! యూ ఆర్ ఇన్ ఇమోషనల్ స్టేట్! నాకు తెలుసు నువ్వు కృతజ్ఞతతో అట్లా ఫీల్ అవుతున్నావు... పద... పడుకో!" అంది సుష్మ. ఆర్ట్‌ను నడిపించుకొని తీసుకుపోయి పక్క మీద పడుకోబెట్టింది. పడుకొని ఆర్ట్ రెప్ప వేయకుండా సుష్మ వైపు చూసాడు.

"సుష్! ఐయామ్ నార్మల్. ఫీలింగ్ నార్మల్. నువ్వంటె నాకెప్పుడూ ఆకర్షణ వుంది. నిన్ను చూసిన మొదటి క్షణం నుంచి నువ్వు నన్ను ఆక ర్షించావు. కాని నేను ఆ ఆకర్షణ ప్రేమ కింద మారకుండా జాగ్రత్తపడ్డాను. నన్ను నేను ఇన్నా ళ్ళు కంట్రోల్ చేసుకున్నాను! కాని ఈ రోజు ఈ సంఘటన నా కళ్ళు తెరిపించింది! నా ప్రేమను కప్పిపెట్టటానికే నువ్వు చేసే ప్రతి పనిలో తప్పు పట్టేవాడిని! నా ఆధిక్య భావాన్ని సుపీరియార్టీ కాంప్లెక్స్‌ను ఈరోజు సంఘటన ముక్కముక్కలు చేసింది. నన్ను నీకు ఈక్వెల్ అనే భావనను కలిగించింది. ఇన్ని రోజులు నేను నిన్ను ప్రేమిస్తు న్నానని నా మనస్సుకు తెలిసినా నేను బయట పడలేదు. అది నా సూపర్ రేస్ భావనే కావచ్చు ను! నువ్వు నన్ను రక్షించావు! మూసుకపోయిన నా మనోకవాటాలను తెరిపించావు! నేను నిన్ను ప్రేమిస్తున్నాను! సుష్! ఆ మాటలను ఓపెన్‌గా చెప్పే సమయం వచ్చింది! ఇప్పుడు నాలోని సుపీరియార్టీ భావనలన్నీ పటాపంచలయ్యాయి సుష్! విల్‌యూ మ్యారీ మీ! ఐ లవ్‌యూ!" ఆర్ట్ మంచం పక్కన నిలబడ్డ సుష్మ చేతిని తన చేతి లోకి తీసుకున్నాడు. అతని నీలికళ్ళలో సముద్రం లోని అలల తళతళలు!

సుష్మ కొంచెంసేపు అవాక్కయిపోయింది. ఆర్ట్ అంటే తనకెప్పుడూ ఇష్టమే! కాని అతని గాంభీ ర్యం ఆధిక్య భావనలు తనను భయపెట్టేవి. ఇప్పుడు ఆర్ట్ తన సూపర్ రేస్ భావనను వదిలి పెట్టాడు. కళ్ళు తెరిచాడు. హృదయ కవాటాలు తెరచి తన ప్రేమను అంగీకరించాడు! తనకేం అభ్యంతరం లేదు అతని ప్రేమను అందుకోవ టంలో. అతన్ని చూసిన రోజు నుంచి అతని చేత ఆకర్షితురాలయింది. ఆ ఆకర్షణ ఎప్పుడు ప్రేమ లోకి మారిందో తనకు తెలియదు. ఇప్పుడు ఆర్ట్ తనను ప్రేమిస్తున్నానని చెప్పినప్పుడు తన మనసు హృదయం రెండూ ఉప్పొంగాయి! ఆనంద కెరటాలు ఉవ్వెత్తున లేచాయి!

"ఆర్ట్! ఐ లవ్ యూ టూ!" అంది సుష్మ మం చం మీద అతని పక్కన కూర్చొని...అతని హృద యం మీద వాలిపోయింది. సుష్మ తన రెండు చేతులతో అతని తలను చుట్టి గుండెలకు హత్తు కుంది.

** ** **

ఆర్ట్, సుష్మల పెళ్ళి జరిగింది. సంవత్సరం తర్వాత మొదటి మ్యారేజ్ యానివర్సరీకి న్యూ యార్క్ వచ్చారు. డబ్ల్యుటీసీ వున్నచోట ఇప్పుడు ఖాళీ స్థలం! ఇద్దరూ ఆ ప్రదేశంలో పూలగుత్తులు పెట్టారు. ఆ ఖాళీ స్థలంలో వాళ్ళతోపాటు ఎంద రో అక్కడ బంధుమిత్రులను తలచుకొని బొకేల ను వుంచారు. అందరూ మౌనంగా దుఃఖంతో నిలబడ్డారు. అందరి మనస్సులో సెప్టెంబరు పద కొండవ తేదీన జరిగిన పెను విషాదమే. ఆర్ట్, సుష్మలు ఒకరి చేతిలో ఒకరు చేయి వేసుకొని దగ్గరగా నిల్చున్నారు. వాళ్ళ హృదయాల్లో మాత్రం ప్రేమ పుష్పాలు పరిమళిస్తున్నాయి. ఒకరికొకరు హత్తుకుపోయారు. వాళ్ళ కళ్ళల్లో మిలమిలలు! "ఇక్కడ శాంతి శిఖరాలు లేస్తాయి రేపు! అవి తమ మధ్య ఏర్పడిన ప్రేమబంధాలకు చిహ్నాలవుతాయి! అహంభావం అహంకారాలకు గర్వం ఆధిక్య భావాలకు పాలక పాలితులనే సూపర్ రేస్ సిద్ధాంతాలకు మేధావులం ఆధునిక సాంకేతిక విజ్ఞానమంతా మా సొత్తే అని విర్రవీగే మిథ్యా ఆత్మవిశ్వాసానికి సమాధి ఈ శాంతి శిఖ రాలు!" సంతోషంగా నిట్టూర్చింది సుష్మ.

ప్రేమతో ఆర్ట్ ఆమె చేతిని తన చేతిలోకి తీసు కొని అక్కడ్నుంచి సంతృప్తితో కదిలాడు!

•

## ఆదివారం క్విజ్

*** ఆధ్యాత్మికం**

1. అమృతసర్‌లోని స్వర్ణదేవాలయంలో దేవుడి విగ్రహానికి బదులుగా ఏమి ఉంటుంది.

*** సాహిత్యం**

2. వార్తాపత్రికలో సీరియల్‌గా వచ్చిన మొట్టమొదటి ఆంగ్ల నవల ఏది? ఎవరు రాశారు?

*** చరిత్ర**

3. రెండో ప్రపంచ యుద్ధంలో అమెరికా ఓడరేవు పెరల్‌హార్బర్‌పై దాడి చేసిన దేశమేది? ఈ దాడి ఏ రోజున జరిగింది?

*** కళలు**

4. హార్మోనియంను ఏ దేశస్థులు, ఎప్పుడు కనిపెట్టారు?

*** శాస్త్ర విజ్ఞానం**

5. ఆంత్రాక్స్ క్రిమి సమూల నిర్మూలనకు ఎంత ఉష్ణోగ్రత అవసరమౌతుంది?

సమాధానాలు వచ్చేవారం

### గతవారం ప్రశ్నలకు సమాధానాలు

*** ఆధ్యాత్మికం:** 1. క్యాథలిక్ మతాన్ని అనుసరించేవారందరి గురువు **పోప్**. ఆయన రోమ్‌లోని **వాటికన్** నగరంలో ఉంటారు.

*** సాహిత్యం:** 2. మనదేశంలో తొలి నవలగా ప్రసిద్ధిచెందిన దుర్గేశనందిని (1865) రచయిత బంకించంద్ర చటర్జీ

*** రాజకీయం:** 3. సిమ్లా ఒప్పందం **1972**లో ఇందిరాగాంధీ, జుల్ఫికర్ అలీ భుట్టోల మధ్య కుదిరింది.

*** కళలు:** 4. సంగీత పరికరాలలో ఒకటైన పియానోను క్రిస్టోఫర్ (ఇటలీ) అనే కళాకారుడు **1709**లో కనిపెట్టాడు.

***శాస్త్ర విజ్ఞానం:** 5. ఉపాధిరంగంలో ఇటీవల తరచు వినిపిస్తున్న బి.పి.ఓ. అనే సంక్షిప్త నామానికి బిజినెస్ ప్రాసెస్ ఔట్‌సోర్సింగ్ అని అర్థం.

